# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 44 | పేజీలు: 5 | వెల: రూ.4/- | ఆదివారం 5 అక్టోబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు టెండర్ పక్రియ

### మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

**నల్లగొండ, అక్టోబర్ 4 (నమస్తే ఉదయం):** రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం టెండర్ పక్రియ ప్రారంభం కానుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభించేలా చేస్తామని చెప్పారు. శనివారం నాడు మంత్రి చిట్యాల లో మీడియాతో మాట్లాడుతూ.. 2017- 18 లో ప్రధాని మోదీ ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డుకు అంగీకరిస్తే..బిఆర్ఎస్ ప్రభుత్వం భూ సేకరణ చేయకుండా నిర్లక్ష్యం వహించిందని మంత్రి కోమటి రెడ్డి నాటి కేసీఆర్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు.



## ఆత్మనిర్భర భారత్‌కు ఐటీఐలు కీలకం

### శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే సాకారం

### కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మోడీ

### బీహార్‌లో ప్రారంభించిన సిఎం నితీశ్ కుమార్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (నమస్తే ఉదయం)**

ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు (ఐటీఐ) ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు అని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఐటీఐలు పారిశ్రామిక విద్యా సంస్థలు మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాప్‌లు అని ఆయన చెప్పారు. యువత సాధికారతకు మెగా ప్రోగ్రామ్‌గా ఈ ఈవెంట్‌ను ప్రధాని వర్ణించారు. 'శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' అని ఉటంకిస్తూ, స్కిల్డ్ వ్యక్తులను గౌరవించాలని ప్రధాని సూచించారు. ఈ సందర్భంగా రూ. 62,000 కోట్లకు పైగా విలువైన యువత- కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధాని శనివారం ఢిల్లీలో ప్రారంభించారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మాట్లాడారు. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధాన మంత్రి సేతు పథకాన్ని రూ. 60,000 కోట్లతో ప్రవేశపెట్టారు. దేశంలో 2014 వరకు 10,000 ఐటీఐలు ఉండగా, ..మిగతా 2లో

# మాట్లాడుకోవడాలు లేవు



### లొంగిపోవడమే.. మావోయిస్టులకు తేల్చిచెప్పిన అమిత్ షా

### మావోయిస్టులతో చర్చలకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేవన్న అమిత్ షా

### లొంగిపోతారా లేక కూంబింగ్ ఎదుర్కొంటారా అంటూ వ్యాఖ్యలు

### నక్సలిజం నిర్మూలనకు 2026 మార్చి 31 డెడ్‌లైన్ అని వెల్లడి

### గ్రామాలను నక్సల్ ఫ్రీ చేస్తే కోటి రూపాయల అభివృద్ధి నిధులు

### గడిచిన నెలలోనే 500 మంది మావోయిస్టుల లొంగుబాటు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (నమస్తే ఉదయం)**

మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కరాఖండిగా తేల్చి చెప్పారు. ఆయుధాలు వీడి లొంగిపోవడం లేదా భద్రతా బలగాల కూంబింగ్ ఆపరేషన్లను ఎదుర్కోవడం మినహా వారికి మరో మార్గం లేదని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకు 2026 మార్చి 31వ తేదీని డెడ్‌లైన్‌గా నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు. దసరా ఉత్సవాల్లో పాల్గొనేందుకు బస్తర్ వచ్చిన అమిత్ షా, జగదల్‌పూర్‌లో జరిగిన ఒక సభలో మాట్లాడారు. ఇటీవల మావోయిస్టులు చర్చలకు సిద్ధమంటూ కరపత్రాలు విడుదల చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "దేశంలోనే అత్యుత్తమ పునరావాస విధానం అమలులో ఉంది. గత పదేళ్లలో ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి కోసం దాదాపు 5 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశాం. చర్చల్లో మాట్లాడుకోవాల్సింది ఇంకేం మిగిలుంది?" అని అమిత్ షా ప్రశ్నించారు. దారి తప్పిన మావోయిస్టులను తిరిగి జనజీవన స్రవంతిలోకి రప్పించేందుకు గ్రామస్తులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఇప్పటికే 4.40 లక్షల కోట్ల రూపాయలు విడుదల చేశామని, దీని ఫలితంగా కొత్త పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు ఏర్పాటయ్యాయని వివరించారు. నక్సల్ హింస బాధితుల కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 15,000 ఇళ్లను కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు సత్ఫలితాలనిస్తున్నాయని అమిత్ షా పేర్కొన్నారు. గడిచిన నెలలోనే 500 మంది మావోయిస్టులు లొంగిపోయారని వెల్లడించారు. ఏదైనా గ్రామం నక్సల్ రహితంగా మారితే, దాని అభివృద్ధికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తక్షణమే కోటి రూపాయలు విడుదల చేస్తుందని హామీ ఇచ్చారు. అధికారిక లెక్కల ప్రకారం, గత 13 నెలల్లో భద్రతా బలగాలు జరిపిన ఆపరేషన్లలో 305 మంది మావోయిస్టులు హతమవగా, 1,177 మంది అరెస్ట్ అయ్యారు. మొత్తం 985 మంది లొంగిపోయారు. ఒక్క బీజాపూర్ జిల్లాలోనే ఈ ఏడాది 410 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారిలో కీలక నేతలు కూడా ఉన్నారు.

## 6 నెలల్లో టిమ్స్ ఆస్పత్రులు పూర్తి చేయాలి



### ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలి

### లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హరీశ్ రావు హెచ్చరిక

### పార్టీ నేతలతో కలిసి కొత్తపేట టిమ్స్ నిర్మాణాల పరిశీలన

**హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే ఉదయం)**

బిఆర్ఎస్ హయాంలో గతంలో టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాన్ని కేసీఆర్ తలపెట్టారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నిర్మాణ పనులను రేవంత్‌రెడ్డి సర్కార్ నత్తనడకన చేస్తోందని విమర్శించారు. కొత్తపేటలో టిమ్స్ భవనాలను పార్టీ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, వివేకానంద, కాలేరు వెంకటేశ్‌తో కలిసి పరిశీలించారు. పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడతూ.. తమ ప్రభుత్వం ఉండి ఉంటే.. ఇప్పటికే టిమ్స్ పూర్తయ్యేదని చెప్పారు. రాజకీయాలను పక్కనపెట్టి కంటి వెలుగు కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారులో ఆరోగ్యశ్రీ ..మిగతా 2లో




## ఛత్ పండుగ తర్వాతే బిహార్ ఎలక్షన్స్

### ఈసీని కోరిన రాజకీయ పార్టీలు

### ఓటింగ్ జరిగేటప్పుడు బుర్ఖా ధరించి వచ్చే మహిళలను తనిఖీ చేయాలి- బీజేపీ డిమాండ్

2



## ప్రయాణికులకు ఆర్టీసీ షాక్

### సిటీ బస్సుల్లో ఛార్జీల పెంపు

### సోమవారం నుంచి అమల్లోకి ఛార్జీలు

**హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే ఉదయం)**

జంటనగరాల పరిధిలో నడిచే ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీలను పెంచాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్ణయించింది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ -ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజీల వరకు రూ.5 చొప్పున పెంచనున్నారు. 4వ స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీ వసూలు చేయనున్నారు. మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ తర్వాత అదనంగా రూ.10 ఛార్జీ వసూలు చేయనున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి పెంపు అమల్లోకి రానుంది. నగరంలో దశలవారీగా హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల రాబోయే రెండేళ్లలో 2,800 ఎలక్ట్రిక్ బస్సులను దశల వారీగా డీజిల్ బస్సుల స్థానంలో ప్రవేశ పెట్టాలని సంస్థ భావిస్తోంది. ఇందుకోసం మరో పది డిపోలను అదనంగా ఏర్పాటు చేయాలని, వాటికి 10 ఛార్జింగ్ స్టేషన్లు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు.

## ఆక్రమణల కూల్చివేత

### హైకోర్టు తీర్పుతో తాత్కాలిక షెడ్లను కూల్చిన హైడ్రా

### కొండాపూర్‌లో 36 ఎకరాల్లో ఆక్రమణల కూల్చివేత

### దాదాపు 3600 కోట్ల విలువైన భూమిగా వెల్లడి



**హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే ఉదయం)**

భాగ్యనగరంలో హైడ్రా అధికారుల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. వరుసగా అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శనివారం కొండాపూర్‌లో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. కొండాపూర్‌లోని బిక్షపతి నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు హైడ్రా సిబ్బంది. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు మీడియాని పోలీసులు అనుమతించడం లేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే మీడియాను, స్థానికులను పోలీసులు అడ్డుకుంటున్నారు. కోర్టు ఆదేశాలతో హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో హైడ్రా భారీగా కూల్చివేతలు చేపట్టింది. ఆర్టీఏ ..మిగతా 2లో

## అమెరికాలో దుండగుడి కాల్పుల్లో హైదరాబాద్ విద్యార్థి మృతి

### అమెరికాలో ప్రజ్వరిల్లిన తుపాకీ సంస్కృతి

### ఉదయం డాలస్ నగరంలో కాల్పుల ఘటన

### ప్రాణాలు కోల్పోయిన చంద్రశేఖర్

### చంద్రశేఖర్ స్వస్థలం హైదరాబాదులోని ఎల్బీనగర్

### బీడీఎస్ అనంతరం ఉన్నత చదువుల కోసం అమెరికా పయనం

**హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే ఉదయం)**



అమెరికాలో తుపాకీ సంస్కృతి మరోసారి పడగవిప్పింది. ఓ దుండగుడు విచక్షణ రహితంగా జరిపిన కాల్పుల్లో హైదరాబాద్ విద్యార్థి పోలే చంద్రశేఖర్ మృతి చెందాడు. చంద్రశేఖర్ స్వస్థలం హైదరాబాద్ లోని ఎల్బీనగర్. బీడీఎస్ అనంతరం ఉన్నత చదువుల కోసం అతడు అమెరికా వెళ్లాడు. డాలస్ నగరంలో ఉదయం జరిగిన ఈ కాల్పుల ఘటనలో ..మిగతా 2లో

# 6 నెలల్లో టిమ్స్ ఆస్పత్రులు పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి...

ఆసుపత్రులకు బకాయిలు పెట్టారని విమర్శించారు. కేసీఆర్ తీసుకొచ్చిన మంచి పనులు ఆపాలనే ఆలోచనలో సీఎం ఉన్నారని దుయ్యబట్టారు. ఆరు నెలల్లోపు టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలు పూర్తి చేయాలని.. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ నగరానికి నలు దిక్కులా నిర్మాణంలో ఉన్న టిమ్స్ ఆస్పత్రి భవనాలను ఆరు నెలల్లోపు పూర్తి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆరు నెలల్లోపు ఆస్పత్రులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మాణం మొదలుపెట్టిన కొత్తపేట టిమ్స్ ఆస్పత్రిని మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పరిశీలించారు. నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎందుకు రెండు సంవత్సరాల నుండి టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం కాలేదు. ఆనాడు మేము భూసేకరణ చేసి, టెండర్లు పిలిచి, డిజైన్లు పూర్తి చేసి, 6 అంతస్తుల భవన నిర్మాణం పూర్తి చేసాము.. కానీ ఈ ప్రభుత్వం రెండేళ్లలో 5 ఎ÷-లోర్లు మాత్రమే వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండి ఉంటే ఈ ఆసుపత్రి గత ఏడాదే ప్రారంభమయ్యి ప్రజలకు సేవలు అందించేది. ఎక్కడ కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి పేరు వస్తుందో అని కావాలనే ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని స్లో చేస్తున్నారు. ముందు చూపు లేని మంద బుద్ధి కలిగిన నాయకులు కాంగ్రెస్ నాయకులు అని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో మహేశ్వరం నియోజకవర్గంలో రూ.176 కోట్లతో మెడికల్ కాలేజీ, 500 పడకల ఆసుపత్రిని కట్టడానికి జీవో ఇచ్చాం. 27-09-2023 నాడు నేను, సబితక్క కలిసి వెళ్ళి ఆ మెడికల్



కాలేజీకి, 500 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన కూడా చేశాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మెడికల్ కాలేజీని, 500 పడకల ఆసుపత్రిని రద్దు చేసి ఎల్బీ నగర్ టిమ్స్‌లో విలీనం చేశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవరంలో రూ.182 కోట్లతో ఇంకో మెడికల్ కాలేజీని కట్టాలని కేసీఆర్ జీవో ఇస్తే, ఈ ప్రభుత్వం అది రద్దు చేసి అల్వాల్ టిమ్స్‌లో కలిపారు. మేడ్చల్ జిల్లాలో ఒక్క మెడికల్ కాలేజీ లేకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసింది అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీని రూ. 10 లక్షలకు పెంచాను అంటావు.. ఇవాళ ఆసుపత్రుల వాళ్ళ మేము ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయము బంద్ చేస్తాము అని చెప్తున్నారు. నీ పాలన ఎలా ఉంది అంటే.. కాలేజీలు బంద్ చేస్తామని ప్రైవేట్ కాలేజీలు, ఆసుపత్రులు బంద్ చేస్తామని ప్రైవేట్ ఆసుపత్రులు చెప్తున్నాయి. ఆరోగ్యశ్రీకి కేసీఆర్ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నిధులు ఇచ్చి మంచి వైద్యం అందించాము.. కానీ నువ్వు వచ్చి రూ.1400 కోట్లు ఆరోగ్యశ్రీ కింద బకాయి పెట్టావు. ఇప్పటికైనా ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేసి.. పేదలకు వైద్యం అందే లాగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.




## బిసి రిజర్వేషన్లపై సుప్రీంలో సవాల్

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే ఉదయం)

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వంగ గోపాల్‌రెడ్డి సెప్టెంబరు 29న సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈనెల 6న పిటిషన్‌పై విచారణ జరపనుంది. తెలంగాణలో స్థానిక ఎన్నికలకు ఇటీవల నగారా మోగింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. దీంతో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని బీసీ రిజర్వేషన్ల అంశం రోజుకో మలుపు తీసుకుంటుంది.

## ఆత్మనిర్భర భారత్‌కు ఐటీఐలు కీలకం

మొదటి పేజీ తరువాయి...

గత దశాబ్దంలో 5,000 కొత్తగా ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేశారని, ఈ 11 సంవత్సరాల్లో 1.5 కోట్ల మంది యువకులకు స్థానిక భాషల్లో స్కిల్స్ శిక్షణ ఇచ్చారని ప్రధాని తెలిపారు. అటు, బిహార్‌లోనూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ యువత సాధికారతను ప్రతిష్టాత్మకంగా నిర్వర్తిస్తున్నారు. నిశ్చయ్ స్వయం సహాయతా భత్తా యోజనాను ఆధునీకరించి, ప్రతి ఏటా 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు రూ. 1,000 నెలవారీ స్కాలర్ షిప్, రెండు సంవత్సరాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో యువతకు ఫ్రీ స్కిల్ ట్రైనింగ్ అందిస్తున్నారు. అంతేకాదు, బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్‌ను రీడిజైన్ చేసి, యువతకు రూ. 4 లక్షల వరకు ఇంటరెస్ట్ ఫ్రీ లోన్‌లు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా 3.92 లక్షల మంది విద్యార్థులు రూ. 7,880 కోట్ల లోన్‌లు పొందారు. గత రెండేళ్లలో బిహార్ ప్రభుత్వం 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యువత సామర్థ్యాన్ని మరింత పెంచడానికి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలన తో పోలిస్తే నితీశ్ ప్రభుత్వం బిహార్ విద్యా బ్జడెట్‌ను అనేక రెట్లు పెంచిందన్నారు. అందువల్లే నేడు బిహార్‌లోని మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 19 జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలను ఆమోదించిందని తెలిపారు. ఃాష్ట్ర ప్రభుత్వం 'స్టూడెంట్ క్రెడిట్ కార్డ్' ద్వారా పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడానికి మద్దతిస్తోందన్నారు. దేశంలోనే బిహార్‌లో అత్యధిక యువ జనాభా ఉందని.. బిహార్ యువత సామర్థ్యం పెరిగినప్పుడు సహజంగానే దేశ బలం కూడా పెరుగుతుందని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నో ఏళ్లు యువత ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని.. దాంతో దేశంలో అభివృద్ధి కుంటుపడిందని మోదీ మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం భారత్ మూడో ఆర్థికశక్తిగా రూపుదిద్దు కునేందుకు సిద్ధమవుతోందన్నారు. బిహార్‌లో విద్యార్థుల కోసం పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో పీఎం-సేతు పథకాన్ని ప్రారంభించారు. ఇది విద్యార్థుల విద్యా, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

## స్థానిక ఎన్నికలపై కమలం గురి

### జూబ్లీహిల్స్ అభ్యర్థి కోసం త్రీమెన్ కమిటీ

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే ఉదయం)



తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీలు తమతమ కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టింది. ఈనెల 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుండగా.. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలుపెట్టింది. ఈనెల 5లోగా ప్రతీ స్థానానికి ముగ్గురు పేర్లను ఇవ్వాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు.. పార్టీ నాయకులను ఆదేశించారు. జట్పీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత రాష్ట్ర కమిటీకే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత జిల్లా పార్టీ కోర్ కమిటీలకు అప్పగించనున్నారు. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కూడా సమయం దగ్గర పడుతుండటంతో.. అభ్యర్థి ఎంపికపై బీజేపీ కసరత్తు చేస్తోంది. దీని కోసం ముగ్గురు సభ్యులతో కమిటీని బీజేపీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లో అభిప్రాయ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కమిటీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో మాజీ ఎమ్మెల్యే ధర్మరావు, మాజీ ఎంపీ రాములు, అడ్వకేట్ కోమల ఆంజనేయులుకు చోటు దక్కింది. ఈనెల 9వ తేదీన స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై అన్ని పార్టీలు ఫోకస్ పెట్టాయి. మరోవైపు జిల్లాల్లో పార్టీ అభ్యర్థుల నుంచి వివరాలు సేకరిస్తోంది. గ్రామస్థాయి నుంచి గెలుపు గుర్రాలపై దృష్టి సారించింది.




## ఛత్ పండుగ తర్వాతే బిహార్ ఎలక్షన్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (నమస్తే ఉదయం)

బిహార్ శాసనసభ ఎన్నికలు ఛత్ పండుగ తర్వాత నిర్వహించాలని అక్కడి రాజకీయ పార్టీలు ఎలక్షన్ కమిషన్ (ఈసీ) ను కోరాయి. బిహార్ శాసనసభ ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు రెండు రోజుల పర్యటన కోసం పట్నా వెళ్లిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సారథ్యంలోని ఈసీ బృందాన్ని 6 జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీల నేతలు కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

### ఒకే విడతలో పోలింగ్!

ఈసీని కలిసిన రాజకీయ పార్టీల నేతలు ఈసారి తక్కువ విడతల్లో పోలింగ్ నిర్వహించాలని కోరారు. వీలైతే ఒకటి లేదా రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అయితే మహారాష్ట్ర మాదిరిగా బిహార్‌లోనూ ఒకే విడతలో పోలింగ్ జరపాలని జేడీయూ నేతలు విజ్ఞప్తి చేశారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన బిహారీలు దీపావళి, ఛత్ పండుగలకు స్వస్థలాలకు తిరిగి వస్తారని, అప్పుడు పోలింగ్ నిర్వహించటం వల్ల ఓటింగ్ శాతం పెరుగుతుందని వారు అన్నారు. బిహార్‌లో నిర్వహించే ముఖ్యమైన పండుగల్లో ఛత్ ఒకటి. ఈ పండుగను దీపావళి తర్వాత 6 రోజులకు జరుపుకొంటారు.

### ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు ఉన్నాయ్!

ఆర్జేడీ కూడా ఛత్, దీపావళి తరువాత ఎన్నికలు నిర్వహించాలని కోరింది. లేకుంటే ప్రజలు అసౌకర్యానికి గురవుతారని ఈసీకి తెలిపింది. ఆర్జేడీ ఎంపీ అభయ్ కుశ్వాహా మాట్లాడుతూ, బిహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టి ఓటర్ జాబితా నుంచి ఏకంగా 3,66,000 ఓటర్లను తొలగించారని, దీనిపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు. తొలగించిన ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచాలని ఈసీని ఆయన కోరారు. ఇక బురా□లు ధరించి వచ్చే మహిళలను, వారి ఓటరుకార్డులను సరిగ్గా తనిఖీ చేయాలని బీజేపీ నేతలు ఈసీ బృందాన్ని కోరారు. అంతేకాదు ఓటింగ్ పూర్తైన తరువాత పోలింగ్ ఏజెంట్లు ఫారమ్ 17సీ సేకరించేలా చూడాలని, దీని వల్ల ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగిందో లేదో తెలుస్తుందని, ఈవీఎంలపై ఉన్న సందేహాలు కూడా తొలగిపోతాయని చెప్పారు. అయితే బిహార్ అసెంబ్లీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించాలని, బహుళ దశల్లో జరిపితే ఓటర్లకు అసౌకర్యం, అభ్యర్థులకు ఖర్చులు పెరుగుతాయని బీజేపీ నేతలు ఎలక్షన్ కమిషన్ కు తెలిపారు.

### పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్యను తగ్గించాలి!

లోక్ జనశక్తి పార్టీకి చెందిన నేతలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్యను 1200 నుంచి 800కు తగ్గించాలని ఈసీని కోరారు. సీనియర్ సిటిజన్లను పోలింగ్ బూత్‌లకు తీసుకురావడానికి ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుత బిహార్ శాసనసభ గడువు నవంబర్ 22న ముగియనుంది. కనుక అంతకు ముందే కొత్త శాసనసభ ఏర్పాటు చేయాలి. దీపావళి అక్టోబర్ 20న వస్తుంది. నాలుగు రోజుల ఛత్ పండుగ అక్టోబర్ 28న ముగుస్తుంది. కనుక నవంబర్ మొదటివారంలో బహుశా ఎన్నికలు జరిగే అవకాశం కనిపిస్తోంది. 2020లో మూడు దశల్లో బిహార్ ఎన్నికలు నిర్వహించారు. కానీ ఈ ఏడాది ఒకటి లేదా రెండు దశ్లలో ఎన్నికలు జరగవచ్చని భావిస్తున్నారు.



## ఆక్రమణల కూల్చివేత

మొదటి పేజీ తరువాయి...

కార్యాలయం పక్కన భిక్షపతి నగర్‌లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు ఎవరినీ అనుమతించలేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే బారికేడ్లను ఏర్పాటు చేసి స్థానికులను అడ్డుకున్నారు. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారు. ఈ విషయమై హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా ఆక్రమణల తొలగింపును చేపట్టింది. తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. సర్వే నంబర్ 59లోని ఈ భూముల విలువ రూ.3,600 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు 60 ఏళ్లుగా తమ అధీనంలో భూములున్నాయని రైతులు చెబుతున్నారు. హైదరాబాద్ నగరంలోని కొండపూర్ లో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించడం ద్వారా . దాదాపు 3600 కోట్ల రూపాయల విలువ చేసే 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలోని సర్వే నంబర్ 59లో 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జా చేశారని హైడ్రా తెలిపింది. దీనిపై గతంలో రైతులకు అనుకూలంగా రంగారెడ్డి జిల్లా సివిల్ కోర్టు తీర్పు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పును హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వం సవాల్ చేసింది. దీంతో ఉన్నత న్యాయస్థానం సర్కార్ కి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ 36 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని తేల్చి చెప్పింది. హైకోర్టు తీర్పు మేరకు శనివారం ఉదయం నుంచి కొండాపూర్ లోని బిక్షపతి నగర్ ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణల తొలగింపును భారీ పోలీస్ బందోబస్తు మధ్య హైడ్రా సిబ్బంది చేపట్టింది. తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారని హైడ్రా అధికారులు తెలిపారు. అయితే, గతంలో రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది రంగారెడ్డి కోర్టు. రంగారెడ్డి కోర్టు తీర్పును తెలంగాణ హైకోర్టులో సవాల్ చేసింది ప్రభుత్వం. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది హైకోర్టు. 36 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని తేల్చింది హైకోర్టు. హై కోర్టు తీర్పు మేరకు శనివారం ఆక్రమణల తొలగింపును చేపట్టామని హైడ్రా అధికారులు చెప్పుకొచ్చారు. తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించామని హైడ్రా అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో గత కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు భారీ స్థాయిలో వెలిశాయి. కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. యథేచ్ఛగా అక్రమార్కులు నిబంధనలని ఉల్లంఘిస్తున్నారు. అక్రమ నిర్మాణాలతో పలు ప్రాంతాలు వర్షాకాలంలో వరదలకు గురవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై హైడ్రా అధికారులకు ఫిర్యాదులు వస్తోండటంతో చర్యలు చేపట్టారు.

## అమెరికాలో దుండగుడి కాల్పుల్లో హైదరాబాద్ విద్యార్థి మృతి

మొదటి పేజీ తరువాయి...

అతడు ప్రాణాలు కోల్పోయాడు. చంద్రశేఖర్ ఓ పెట్రోల్ బంకులో పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తున్నాడు. పెట్రోల్ కోసం వచ్చిన ఓ వ్యక్తి కాల్పులు జరపడంతో చంద్రశేఖర్ మృతి చెందాడు. దాంతో హైదరాబాద్ లోని అతడి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. చంద్రశేఖర్ మరణవార్త విని కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని భారత్‌కు తీసుకువచ్చేందుకు ప్రయ త్నాలు జరుగుతున్నాయి.

### సిఎం రేవంత్ దిగ్భ్రాంతి..హరీష్ రావు పరామర్శ

నల్లజాతీయుడు వచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చంద్రశేఖర్



మృతితో ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన తెలుసుకున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ 2023లో బీడీఎస్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. బీఎన్‌రెడ్డి నగర్‌లో ఉన్న బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి మాజీమంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఉన్నత స్థానంలో ఉంటాడనుకున్న కుమారుడు ఇక లేడన్న విషయం తెలిసి తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన చూసి గుండె తరుక్కుపోతోందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రశేఖర్ మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అతడి మరణం ఆవేదన కలిగించిందన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రశేఖర్ భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు.

## మాజీ మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి అడుగు జాడలలో

# నడుచుకుంటా: పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



మాజీ మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఆయన తనయుడు, బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి




మాట్లాడుతున్న పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

బుద్వేల్, అక్టోబరు 4 (నమస్తే ఉదయం): మాజీ మంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి 71వ జయంతి వేడుకలను శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు, ఆయన అభిమానుల ఆధ్వర్యంలో పీడీపీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఇంద్రన్న తనయుడు, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇంద్రారెడ్డి బ్రతికున్న 45 సంవత్సరాలు ప్రజా సమస్యల కోసం పోరాడారన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని సేవలందించిన నాయకుడు ఇంద్రారెడ్డి అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం తాను పనిచేస్తానన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి గచ్చిబౌళి ను 0చి మణికొండ మీదుగా శంషాబాద్ వరకు మెట్రో రైలు వేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనుకకు తీసుకుందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మెట్రో రైలు రావాలని తాను పోరాటం చేస్తున్నానని దానికి ప్రజలందరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్, మైలార్దేవుపల్లి డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ఎస్ వెంకటేశ్, సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి , జాలిగం చిత్తారి, ముక్రం ఖాన్, జహీరుద్దీన్, నోముల రాము యాదవ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, కొత్త రాజశేఖర్ రెడ్డి, అప్పారెడ్డి ముఖేశ్, పసుపుల రమేశ్ చారి, పి.జీవన్ దాస్, బద్దం శ్రీకాంత్ రెడ్డి, ఎడ్లకాడి సూర్యం, సరికొండ దుర్గేశ్, బండ రాజేశ్ యాదవ్, పుప్పాల లక్ష్మణ్, శ్రీవర్ధన్ రెడ్డి , పచ్చ శ్రీనివాస్, షేక్ నయీముద్దీన్, కొంపల్లి జగదీశ్, శ్రీకాంత్ రెడ్డి, గంగిడి కరుణాకర్ రెడ్డి, చెట్టిగారి చిన్న తదితరులు పాల్గొన్నారు.

# రూ.4.75 లక్షలు పలికిన అమ్మవారి పట్టుచీర



వేలం పాటలో అమ్మవారి పట్టు చీరను సొంతం చేసుకున్న కొండా కవితా వెంకటేష్ కు చీర ను బహుకరిస్తున్న పద్మశాలిపురం జై మాతాది యూత్ అసోసియేషన్ ప్రతినిధులు

బుద్వేల్, అక్టోబరు 4 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పద్మశాలి పురం లో నవరాత్రులు పూజలందుకున్న అమ్మవారి పట్టుచీర ను శనివారం నిర్వహించిన వేలం పాటలో అదే బస్తీకి చెందిన కొండా కవిత వెంకటేశ్ రూ. 4,75.000 లకు తీసుకున్నారు. అమ్మవారి పట్టుచీర ను తీసుకున్న కొండా కవితా వెంకటేశ్ దంపతులను భూ లక్ష్మమ్మ దేవాలయం జై మాతాదీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి పట్టుచీర ను అందజేశారు. అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా సోమశీల లో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ సంకూరి జయప్రకాశ్, జై మాతాది యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సంకూరి శ్రీకాంత్, మసున గిరి, గంజి లాలీశ్వర్, పొన్న సంతోష్ కుమార్, మొగిలి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 2002 నుంచి అమ్మవారి చీర వేలం పాట :

2002 నుంచి పద్మశాలిపురం భూ లక్ష్మమ్మ దేవాలయం ఆవరణలో ప్రతిష్టిస్తున్న అమ్మవారి పట్టుచీర ను జై మాతాదీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేలం వేస్తు వస్తున్నారు. అమ్మవారి పట్టుచీరను తీసుకున్న వారి కుటుంబంలో సిరుల పంట కురుస్తుందని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉంటారని భక్తుల నమ్మకం. అందుకే ప్రతి సంవత్సరం అమ్మవారి పట్టుచీర వేలం పాటలో ధర పై పైకి పెరుగుతూనే వచ్చింది. 2002 లో చెరుపల్లి అశోక్ రూ. 501లు, 2003లో సరాబు సరాబు కేదావరి రూ.601లకు, 2004లో మొగిలి క్రిష్ణ రూ.2500లకు, 2005లో సంకూరి జయప్రకాశ్ రూ.4వేలకు, 2006లో సంకూరి జయప్రకాశ్ రూ. 5వేలకు, 2007లో గుర్రం బాల్రాజ్ రూ.7వేలకు, 2008లో నాన్న వెంకటయ్య రూ.7500లకు. 2009లో మదుపటి మహేశ్ రూ. 12వేలకు. 2010లో యంజాల మహేశ్ రాజ్ రూ. 13వేలకు, 2011లో మిట్కోలు కిరణ్ రూ.14,500లకు, 2012లో గుత్తా రాజేశ్ నాయుడు రూ.రూ.18వేలకు, 2013లో కుమార్ రూ.19,001 లకు 2014లో మసున గిరి రూ.26వేలకు, 2015లో మసున గిరి రూ. 53వేలకు, 2016లో మసున గిరి రూ.57 వేలకు, 2017లో మసున గిరి రూ. 84వేలకు, 2018లో సంకూరి జయప్రకాశ్ రూ. 1,01,000లకు, 2019లో సంకూరి జయప్రకాశ్ రూ. 1.08.001లకు, 2020లో మసున గిరి రూ.1,47,000లకు, 2021లో మసున గిరి రూ. 2.28,000 లకు, 2022లో సంకూరి జయప్రకాశ్ రూ. 3,01,116లకు, 2023 లో సంకూరి జయ ప్రకాశ్ రూ. 3,75,000లకు, 2024లో గంజి లాలీశ్వర్ రూ.3.79,000లకు అమ్మవారి పట్టుచీర ను వేలం పాటలో తీసుకున్నారు. తాజా గా 2025లో పద్మశాలిపురం భూ లక్ష్మమ్మ పట్టుచీర ను రూ. 4,75,000 లకు వేలం పాట లో తీసుకున్నారు.



దుర్గామాత వేడుకల్లో భాగంగా అల్వాల్‌లో అన్న ప్రసాదం చేస్తున్న దృశ్యం

## అల్వాల్‌లో ముగిసిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( మల్కాజ్గిరి నియోజకవర్గం ) అల్వాల్ అక్టోబర్ 04 (నమస్తే ఉదయం ) అల్వాల్ లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం 13 రోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 13 వ రోజు దుర్గామాతను నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు కొనసాగుతున్నాయని నిర్వాహకులు చెప్పారు. అమ్మవారికి చివరి రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాదం అందించారు. అమ్మవారి పూజా కార్యక్రమంలో సురేష్, రవి కుటుంబ సభ్యులతో పాటు రమాదేవి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## భారత రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది: మహంకాళి భిక్షు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ) అక్టోబర్ 04 శనివారం ( నమస్తే ఉదయం ) భారత రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు మహంకాళి భిక్షు అన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం 58 వ జ్ఞానమాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు మహంకాళి భిక్షు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జ్ఞానమాల కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేస్తారని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని పాఠ్య పుస్తకాలలో చేర్చేందుకు ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలన్నారు. ఈ జ్ఞానమాల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని జవహర్ నగర్ ప్రజలను ఆయన కోరారు.

## ప్రభుత్వ గురుకుల పాఠశాల కళాశాలలను కాపాడాలి

### మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్


మేడ్చల్ జిల్లా ప్రతినిధి (ఘట్కేసర్ మున్సిపల్) ఘట్కేసర్ అక్టోబర్ 04 ( నమస్తే ఉదయం ) ప్రభుత్వ గురుకుల పాఠశాల కళాశాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. శనివారం ప్రభుత్వ గురుకుల పాఠశాల, కళాశాలల పూర్వ వైభవాన్ని పోస్టు కార్డు ఉద్యమాన్ని ఘట్కేసర్ అభివృద్ధి ప్రదాత మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తరాల ఉద్యమంలో భాగంగా పోస్టు కార్డుల ద్వారా గురుకులాల చరిత్రను వివరిస్తూ గురుకులాల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. 160 వ రోజు విత్తరాలను పోస్ట్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించినట్లు ఆయన వెల్లడించారు.



## నేడు గగన్ పహాడ్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం


రాజేంద్రనగర్, అక్టోబర్ 4(నమస్తే ఉదయం) గగన్ పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జై భవాని విద్యుత్ లీడర్ పరిధిలో ఆదివారం వివిధ మరమ్మత్ల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని జై భవాని, మీనాక్షి , శాతం రాయి పారిశ్రామిక వాడ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శాతం రాయి పారిశ్రామిక వాడ, జై భవాని గల్లి, గోద్రెజ్ రాంకీ రహదారి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరేముంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

# సమాచార హక్కు చట్టానికి తూట్లు?



## 7నిబంధనలకు విరుద్ధంగా అధికారుల తీరు

కేటిదొడ్డి, అక్టోబర్ 4 ( నమస్తే ఉదయం)ప్రభుత్వ కార్యాలయంలో జరిగే పనులు, ఖర్చులు, నిధుల వివరాలు, తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమాచార హక్కు చట్టం- 2005ను తీసుకొచ్చింది. వివిధ ప్రభుత్వ కార్యాలయాలలోకి వెళ్లగానే ముందుగా పౌరులకు దర్శనమించే బోర్డు సమాచార హక్కు చట్టం. ప్రభుత్వ కార్యాలయాల అధికారిక వెబ్సైట్‌లో నుంచి సమాచారం ఎలా పొందాలి? అధికారుల వివరాలు, ఆఫీస్ అడ్రస్, సమాచారం ఇచ్చే అధికారి వివరాలు తదితర వివరాలు ఉంటాయి. ఇటీవల రాష్ట్ర సమాచారహక్కు చట్టం కమిషనర్ జిల్లాలో పర్యటించి సమాచారం అందించాలని జిల్లా అధికారుల సమీక్ష సమావేశాలలో ఆదేశాలు జారీ చేసినా బేఖాతారు చేయడం గమనార్హం. అధికారుల పనితీరులో ఎలాంటి మార్పు రావడంలేదని సమాచార హక్కు చట్టం దరఖాస్తు దారులు వాపోతున్నారు. కేటిదొడ్డి మండలంలో ఉపాధి హామి పథకం (అదనపు కార్యక్రమ అధికారి- ఎన్ఆర్ఈజీఎస్) మాత్రం పౌర సమాచార అధికారి నిబంధనలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి కేటిదొడ్డి మండలానికి చెందిన ఓ వ్యక్తి 2020 నుంచి 2025 సంవత్సరం వరకు కేటిదొడ్డి గ్రామంలో ఉపాధి హామీ పథకం కిందా చేసిన పండ్ల తోటల సాగు వివరాలు, నిర్వాహణ బిల్లు, లబ్దిదారుల వివరాలు, బిల్లుల చెల్లింపు, తదితర వివరాలు సమాచార హక్కు చట్టం ద్వారా ఆగస్టు నెలలో దరఖాస్తు చేశారు. దరఖాస్తు పరిశీలించి 30 రోజుల్లో దరఖాస్తుదారునికి సమాచారం ఇవ్వవలసిన కేటిదొడ్డి ఎన్ఆర్ఈజీఎస్ అధికారి ఉద్దేశపూర్వకంగా సెప్టెంబర్ 15న పేపర్‌కు మూడు రూపాయలు చొప్పున 470 పేజీలకు సుమారు 1456 రూపాయలు కట్టాలంటూ తిరిగి లేఖ పంపినట్లు తెలుస్తోంది.సమాచార హక్కు చట్టం ప్రకారం ఎవరైనా సమాచారం కోరుతూ దరఖాస్తు చేసుకుంటే వారికి 30 రోజుల్లోగా సమాధానం అందించాల్సి ఉంటుంది. కానీ కేటిదొడ్డి ఎంపీడిఓ కార్యాలయంలో రెండు నెలలు గడుస్తున్న ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తూ కాలం గడుపుతున్నారు.బాధితుడు అడిగిన సమాచారం ఇవ్వకపోవడం పట్ల పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. 30 రోజుల్లో ఇవ్వాల్సిన సమాచారాన్ని రెండు నెలలు గడుస్తున్న ఎందుకు ఇవ్వలేదు అంటూ బాధితుడు ప్రశ్నిస్తున్నారు. ఆ సమాచారం లో ఎన్ని లోటుపాట్లు ఉంటే ఆ సమాచారం ఇవ్వడం లేదు అని అనుమాన పడుతున్నారు. బాధితుడు వెళ్లి ఏపీఓ సిబ్బందిని అడగగా పొంతనలేని సమాధానం ఇస్తున్నారు. ఆర్టీఐ యాక్టు కిందా సమాచారం కోరడంతో ఉపాధి కూలీలకు, ఇతర బిల్లులు చెల్లించేందుకు అడ్డొస్తున్నట్లు తనపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆర్టీఐ ఆర్జీదారుడు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ సిబ్బందిపై చర్యలు తీసుకుని బాధితుడు కోరిన సమాచారం బాధితుడికి ఇవ్వాలని డిమాండ్ చేశాడు.



# ప్రేమించిన వ్యక్తితో పెళ్లికావడం లేదని.. యువతి ఆత్మహత్య





### యువతి ఆత్మహత్యకు కానిస్టేబుల్ కుటుంబ సభ్యులే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణలు

### యువతి మృతికి కారకులను శిక్షించాలి ప్రజా సంఘాల డిమాండ్

### యువతి మృతికి కారణమైన పోలీస్ కానిస్టేబుల్ ను విధుల నుంచి తొలగింపు

### పోలీస్ కానిస్టేబుల్ తో పాటు మరో 21మంది పై కేసు నమోదు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 4 ( నమస్తే ఉదయం) ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో ప్రియుడి ఇంటి వద్ద నిరసన చేస్తున్న ఓ యువతి మనస్తాపానికి గురై పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటన గట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గట్టు మండలానికి చెందిన ఓ కానిస్టేబుల్, పాల్వాంచకు చెందిన ఓ యువతిని ప్రేమపేరుతో శారీరకంగా వాడుకొని, పెళ్లి చేసుకోకపోవడంతో మనస్తాపానికి గురైన ఆ యువతి ఆత్మహత్య పాల్పడగా గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. యువతి మృతికి కారకులైన కానిస్టేబుల్ ను జిల్లా ఎస్పీ విధుల నుండి తొలగించారు. అదే విధంగా యువతి మృతికి కారణమైన కానిస్టేబుల్ కుటుంబ సభ్యుల మీద పలు సెక్షన్ ల కిందా గట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాని కుటుంబ సభ్యులకు అందజేశారు. గట్టు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి...గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన రఘునాథ్ గౌడ్ పోలీస్ ఉద్యోగాల కోసం హైదరబాద్ లో శిక్షణ తీసుకునే క్రమంలో ఖమ్మం జిల్లా పాల్వాంచకు చెందిన ప్రియాంకతో(32) ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. రఘునాథ్ గౌడ్ కు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చిన తర్వాత ప్రియాంకను పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో జూలై నెలలో రఘునాథ్ గౌడ్ స్వగ్రామమైన చిన్నోనిపల్లి గ్రామానికి చేరుకుని పెళ్లి చేసుకోమని కానిస్టేబుల్ ను కోరగా అందుకు నిరాకరించడంతో ఆమె కుటుంబ సభ్యులు గద్వాల జిల్లా పోలీసులను ఆశ్రయించారు. ప్రేమించిన యువతిని మోసం చేసిన యువకుడిని శిక్షించాలంటూ ప్రజా సంఘాలు, యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గట్టు పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ పై పలు సెక్షన్ ల కిందా కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. గత నెలలో జైళ్లు నుంచి విడుదల అయ్యాడు.

**కానిస్టేబుల్ ఇంట్లోనే ఉంటూ నిరసన**

చిన్నోనిపల్లి గ్రామం రిజర్వాయర్ లో నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైంది. చిన్నోనిపల్లి పునారావస సెంటర్ లో కొత్తగా నిర్మించిన కానిస్టేబుల్ రఘునాథ్ గౌడ్ కుటుంబ సభ్యుల ఇంట్లోనే ఉంటూ గత మూడు నెలలుగా ప్రియాంక నిరసన చేస్తోంది. అక్కడే ఒంటరి పోరాటం చేస్తూ... పెళ్లి చేసుకోవాలని వేడుకోని రోజులు లేవంటూ స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ప్రియాంకతో కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన ఆ యువతి శుక్రవారం మద్యాహ్నం పురుగుల మందు సేవించింది. గమనించిన స్థానికులు గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. ఆమె ఆసుపత్రి నుంచి తిరిగి చిన్నోనిపల్లి గ్రామానికి చేరుకోగ, పరిస్థితి విషమించడంతో తిరిగి ఆమెను శుక్రవారం రాత్రి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. చికిత్స పొందుతూ... శనివారం ఉదయం ఆమె మృతి చెందింది.

**యువతి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి: ప్రజా సంఘాలు**

కానిస్టేబుల్ రఘునాథ్ గౌడ్ ప్రేమ పేరుతో పాల్వంచకు చెందిన ప్రియాంక అనే యువతిని పెళ్లి చేసుకోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. యువతి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిరాలి కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రి వద్ద ధర్నా చేపట్టారు.ప్రియాంక ఫోన్ ను పోలీసులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టాలన్నారు, పోలీసు వారు ఈ కేసులో ఎలాంటి వివక్ష లేకుండాగా నిష్పక్షపాక్షంగా విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

**విధుల నుండి తొలగింపు**

ప్రియాంక మృతికి కారకులైన కానిస్టేబుల్ రఘునాథ్ గౌడ్ ను పర్మినెంట్ గా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు(డిస్మిస్ చేస్తున్నట్లు) జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు తెలిపారు. ప్రియాంక మృతికి కారకులైన వారి పై కఠిన చర్యలు తప్పవని, అందుకు బాద్యులైన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. కాగ మృతురాలి తల్లి కే. ఆదిలక్ష్మీ, రాంబాబు ఫిర్యాదు మేరకు మృతికి కారకులైన రఘునాథ్ గౌడ్ తో పాటు అతని కుటుంబ సభ్యులు 21మంది పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుతో పాటు పలు సెక్షన్ ల కిందా కేసు నమోదు చేసినట్లు గట్టు ఎస్ఐ కె.టి.మల్లేష్ తెలిపారు.

# ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, అక్టోబర్ 04(నమస్తే ఉదయం): జిల్లా లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల కోసం ఏకాశీల బిఈడి కాలేజ్, ఏబీవీ, విబిఐటి కాలేజీలను అలాగే జనగామ మండలం సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రం కోసం స్థానిక గౌతమ్ మాడల్ స్కూల్ ను డిసిపి రాజమహేంద్ర నాయక్,ఏసిపి పండరి చేతన్, సంబంధిత అధికారులతో కలిసి శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల సంఘం నియమాలకు అనుగుణంగా డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ లు ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద చేయాలిసిన ఏర్పాట్లు, వసతులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పోలీస్ బందోబస్తు, రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమం లో జనగామ ఎంపీడీఓ, జనగామ టౌన్ సీఐ సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.




స్థానిక సంస్థల ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ కోసం ఏబీవీ డిగ్రీ కాలేజీ ని పరిశీలన చేస్తున్న కలెక్టర్, డీసీపీ ఇతర అధికారులు



బక్షి ప్రభావతి ,బక్షి శ్రీ కాంత్ రావు ల షష్టిపూర్తి కార్యక్రమంలో సన్మానిస్తున్న సీనియర్ నాయకులు ఎం భీమ్ రెడ్డి

# ఘనంగా రిటైర్డ్ డిప్యూటీ తాసిల్దార్

### బక్షి ప్రభావతి, బక్షి శ్రీ కాంత్ రావుల షష్టిపూర్తి

కొత్తకోట, అక్టోబర్ 4 ( నమస్తే ఉదయం)వనపర్తి జిల్లా మదనాపురం మండలం నర్సింగాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ డిప్యూటీ తాసిల్దార్ బక్షి ప్రభావతి ,బక్షి శ్రీ కాంత్ రావు దంపతుల షష్టిపూర్తి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ షష్టిపూర్తి కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ డి వెంకటేశ్వర్లు, వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు మూల మళ్ళ భీమ్ రెడ్డి లు పాల్గొని శ్రీకాంత్ రావు షష్టిపూర్తి సందర్భంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. బక్షి ప్రభావతి బక్షి శ్రీ కాంత్ రావు ను సన్మానించిన వారిలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, బంధు మిత్రులు ఉన్నారు.

# ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజావాణి రద్దు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ, అక్టోబర్ 04 (నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించవలసిందిగా కలెక్టర్ కోరారు.



అమ్మవారి చీరను అందుకుంటున్న వేలంపాట గ్రహీత ప్రకాష్ గౌడ్ కుటుంబ సభ్యులు

# ఘాన్సీ మియాగూడలో అమ్మవారి చీర 60 వేలు వేలం పాటలో దక్కించుకున్న చుక్క ప్రకాష్ గౌడ్

శంషాబాద్. అక్టోబర్ 4( నమస్తే ఉదయం) శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని ఘాన్సీమియాగూడ లో నవరాత్రి పూజలు అందుకున్న దుర్గా మాత మండపం అమ్మవారి చీరను శనివారం వేలం వేశారు. వేలం పాటలో చుక్క ప్రకాష్ గౌడ్ అనే వ్యక్తి అమ్మవారి చీరను 59,998 రూపాయలకి కైవసం చేసుకున్నారు. అమ్మవారి చీరను కైవసం చేసుకున్న ప్రకాష్ గౌడ్ ను ఉత్సవ నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టి మల్లేష్ గౌడ్ .పూసలపట్టి శివ గౌడ్ ,మొగిలిగిద్ద ప్రవీణ్ గౌడ్ , కావాలి అశోక్ ముందిరాజ్ ,దేపల్లే పవన్ గౌడ్ ,మొగులిగిద్దా ప్రకాష్ గౌడ్ ,దారమోని శేఖర్ ముదిరాజ్,జిల్లా ఆనంద్ ,దేపల్లే రంజిత్ గౌడ్ ,చుక్క శంకర్ గౌడ్ , పారేపల్లి శ్రీకాంత్ గౌడ్,మొగిలిగిద్ద సిద్దు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నేతలు

### పార్టీ లోకి ఆహ్వానించిన ఎర్రబెల్లి

### పార్టీలో చేరిన బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వడ్లకొండ తార, ఓయూ జేఏసి నేత ఇప్ప పృథ్వీ రెడ్డి

జనగామ,అక్టోబర్ 04 (నమస్తే ఉదయం) జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గం నుండి స్థానిక సంస్థల ఎన్నికల వేళ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరిన కాంగ్రెస్ నేతలు, నియోజకవర్గం నుండి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వడ్లకొండ తార,ఓయూ జేఏసి నేత ఇప్ప పృథ్వీ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వీరితో పాటు దేవరుప్పుల మండలం,నీర్మాల గ్రామం నుండి నీర్మాల గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల రవీందర్ రెడ్డి,వడ్లకొండ ప్రశాంత్, తీరుపెల్లి కొండల్ రెడ్డి, ఎడ్ల శ్రీను, మెట్టు వింసెట్ రెడ్డి, బత్తిని మల్లేశ్, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారికి బిఆర్ఎస్ కండువాలు కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి..ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశ్, మాజీ జిసిసి చైర్మెన్ ధరావత్ గాంధీ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాంసింగ్ నాయక్, మాజీ ఎంపీపీ కొల్లూరి సోమయ్య, మండల యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్, మండల సీనియర్,యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నేతలు..



# విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

### పరిమిత సంఖ్యలోనే విద్యార్థులకు అడ్మిషన్లు

### యూనివర్సిటీలకు హుకూం జారీచేసిన వైట్‌హౌజ్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హుకూం జారీచేశారు. విదేశీ విద్యార్థుల రాకపై ఆంక్షలు లాంటి కత్తి పెట్టారు. పరిమిత సంఖ్యలోనే వారిని అనుమతించాలని యూనివర్సిటీలను ఆదేశించారు. అమెరికా ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల అడ్మిషన్లను పరిమితం చేయాలని వైట్ హౌజ్ విశ్వవిద్యాలయాలకు తేల్చిచెప్పింది. ఈమేరకు ప్రతిపాదించిన నిబంధనలను మెమో రూపంలో దేశంలోని ప్రధాన యూనివర్సిటీలకు పంపింది. ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి, జాతి, లింగ ఆధారిత నియామకాలు నిలిపివేయడం, విద్యార్థుల అడ్మిషన్ సమయంలో కచ్చితంగా ప్రామాణిక పరీక్ష నిర్వహించడం వంటివి చేపడితేనే ప్రభుత్వ నిధుల కేటాయింపులో ప్రాధాన్యం లభిస్తుందని వెల్లడించింది. ఈ నిబంధనలను అంగీకరించిన విశ్వవిద్యాలయాలు ప్రభుత్వం నుంచి వచ్చే లబ్దిని పొందవచ్చని ఆ లేఖలో వెల్లడించారు. వీటిల్లో విద్యార్థులకు ప్రభుత్వ రుణాలు, గ్రాంట్లు, కాంట్రాక్టులు, రీసెర్చి నిధులు, విదేశీ స్కాలర్స్‌కు వీసా అనుమతులు, ట్యాక్స్ కోడ్‌లో ప్రాధాన్యం వంటివి పొందవచ్చని పేర్కొంది. అమెరికాలో ఉన్నతవిద్యను పునర్ వ్యవస్థీకరించి తమ భావజాలానికి అనుకూలం గా మార్చుకోవడానికి ట్రంప్ కార్యవర్గం చేస్తున్న మరో యత్నంగా దీనిని భావిస్తున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రభుత్వంతో 500 మిలియన్ డాలర్ల డీల్ చాలా దగ్గరగా ఉందని పేర్కొన్నారు. వైట్‌హౌస్ నుంచి లేఖలు అందుకొన్న వాటిలో అమెరికాలోని ఎంఐటీ సహా ప్రముఖ విశ్వవిద్యాలయాలు మొత్తం ఉన్నాయి. ఈ క్రమంలో విదేశీ వీసాలపై వచ్చే విద్యార్థుల సంఖ్య 15 శాతానికి మించి ఉండకూడదు. ఒకే దేశం నుంచి వచ్చిన విద్యార్థుల సంఖ్య 5 శాతానికి మించకూడదు. విదేశాల నుంచి అందే నిధుల వివరాలను బహిర్గతం చేయాలి. విద్యార్థుల అడ్మిషన్, ఎయిడ్ సమయంలో లింగ, జాతి, జాతీయత, రాజకీయ భావజాలం, జెండర్ ఐడెంటిటీ, లైంగిక ఆకర్షణ, మతపరమైన అంశాలు పరిగణనలోకి తీసుకోకూడదు. అండర్ గ్రాడ్యుయేట్ దరఖాస్తుదారులు కచ్చితంగా ప్రామాణిక పరీక్షను పూర్తిచేయాల్సిందే. విద్యా స్వేచ్ఛను కాపాడే విధానాలు అమలుచేయాలి. సంప్రదాయవాద ఆలోచన సరళిని ఇబ్బందిపెట్టే, దాడులకు పాల్పడే యూనిట్స్‌ను తొలగించడం వంటివి ఉన్నాయి. విద్యాలయాలను ఇబ్బందిపెట్టేలా రాజకీయ ప్రదర్శనలు, విద్యార్థులను లేదా గ్రూపులను వేధించకుండా చర్యలు చేపట్టాలి. ఉద్యోగులు అధికారిక విధుల సమయంలో రాజకీయ ప్రసంగాలు, చర్యలకు దూరంగా ఉండాలి. బాత్‌రూమ్‌లు, లాకర్ రూమ్‌లు లింగ ఆధారంగా వేర్వేరుగా ఉండాలి. హార్డ్‌సైన్స్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉచిత ట్యూషన్ ఫీజ్, ప్రోత్సాహకం కింద 2 మిలియన్ డాలర్లు మించి ఇవ్వాలని ప్రతిపాదించారు. ఈ నిబంధనలు ఏమేరకు అమలుచేస్తున్నారనే అంశాన్ని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్స్‌ను సమీక్షించి తెలుసుకొంటుంది. వీటిని ఉల్లంఘిస్తే ప్రభుత్వ లబ్దిని రెండేళ్లపాటు ఆపేస్తారు.

# రాహుల్ అజ్ఞానానికి పరాకాష్ట!

విదేశాలకు వెళ్లడం..అక్కడ భారత్ పాలకులపై దుమ్మెత్తి పోయడం,ప్రజాస్వామ్యం అపహాస్యం అవు తోందని గగ్గోలు పెట్టడం కాంగ్రెస్ ఎంపి, విపక్షనేత రాహుల్ గాంధీకి బాగా అలవాటయిన కార్యక్రమం. విదేశీ గడ్డపై నుంచి దేశంపై దుమ్మెత్తి పోయడం అలవాటు చేసుకున్న నేతగా బహుళ ప్రచారం పొందు తున్నారు. విదేశీయతను పుణికి పుచ్చుకున్న అపరమేధావిగా నిరూపించుకుంటున్నారు. బిజెపిని విమర్శించినప్పుడల్లా ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం అంటూ విమర్శలు చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం గురించి తెలిసి ఉంటే రాహుల్ ఇలా మాట్లాడరు. ఇకపోతే తమ పాలనలోనే భారతదేశం బాగా పరిఢ విల్లిందని, ఇతరుల అంటే బిజెపి పాలనలో దేశం సర్వనాశనం అవుతోందని, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు కలిసి దేశాన్ని నాశనం చేస్తున్నాయని ఆయన చేస్తున్న విమర్శలు అజ్ఞానానికి పరాకాష్టగా చూడాలి. నిజానికి ఈ దేశంలో రాహుల్‌కు ఉన్న అర్హత ఏమిటి. కేవలం రాజీవ్ గాంధీ తనయుడుగానే ఆయనకు స్థానం ఉంది. అంతకు మించిన రాజకీయ ప్రస్థానం ఆయనకు లేదు. వారసత్వ రాజకీయాల్లో పార్టీ అధ్యక్షుడిగా, ఎంపిగా వెలగబెడుతున్న రాహుల్ భారత్ ఔన్నత్యం, గొప్పతనం గురించి తెలియని అజ్ఞానిగా భావించాలి. అధికారం కల్ల అని తెలుసుకోవడంతో ఏదేదో మాట్లాడుతున్నారు. అడ్డగోలు విమర్శలు చేస్తున్నారు. బంగ్లాదశ్, నేపాల్ లాంటి ఆందోళనలు మనదేశంలోనూ రావాలని కోరుకుంటున్నారా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. వసుదైక కుటుంబ, సర్వేజనా సుఖినో భవంతు అన్న ఆర్యోక్తి మన మట్టిలో పుట్టిన అత్యున్నత మానవాతా వాద విలువలకు అద్దంపట్టేవి.. కానీ ఇవేవీ తెలియకుంటా ఏదోఒక చిన్న దేశానికి వెళ్లడం అక్కడ భారత్‌లో పాలన సరిగా లేదని, ఇక్కడ ప్రజాస్వామ్యం భ్రష్టుపట్టి పోతోందని గొంతు చించుకుంటున్నారు. ఈ దేశంలో ప్రజలు ఎంతో ఉన్నతంగా ఆలోచించి కాంగ్రెస్‌ను ఆదరించారు. అది ఎన్ని దేశద్రోహ పనులు చేసినా వెనకేసు కొచ్చారు. ఎమర్జెన్సీతో భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. అలాంటి పార్టీలో ఉంటూ ప్రజా స్వామ్యం గురించి, ఓట్ చోరీ గురించి గొంతు చించుకుంటున్నారు. అంతకు మించి ఆర్‌ఎస్‌ఎస్ గురించి అవాకులు చవాకులు పేలుతన్నారు. నిజానికి రాహుల్ భారతీయత కలిగిన నేత అయితే ఆర్‌ఎస్‌ఎస్ గరించి తెలుసుకుని ఉండేవారు. ఈదేశం కోసం, దేశ పటిష్టత కోసం, దేశం సర్వతో ముఖోన్నతి కోసం అహరహరం శ్రమిస్తున్న ఏకైక సంస్థ ఆర్‌ఎస్‌ఎస్. దాని గురించి తక్కువ మాట్లాడే వారు చరిత్ర హీనులు కాకతప్పదు. హిందూ సంస్కృతి నశిస్తే హిందూ సమాజమే ఉండదు. ప్రపంచానికి నాగరిక తను నేర్పిన దేశం కేవలం హిందూమతం, భారతదేశం మాత్రమే. ఎన్నోదాడులను, మత దురాచారా లను, మతమార్పిడులను తట్టుకుని కూడా భారత్ ఇవాళ ప్రపంచానికి వెలుగుదివిటీగా సాగుతోంది. ఆర్‌ఎస్‌ఎస్ శతవసంతాల వేళ విదేశీ గడ్డపై నుంచి ఆర్‌ఎస్‌ఎస్ గురించి చేసిన ప్రేలాపనలు ఎంతమాత్రం సహించ రానివి. ఎన్నో దాడులు, బలిదానాలు, మతమార్పిళ్ల నేపథ్యంలో హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం ప్రతి హిందువు కర్తవ్యం అంటూ డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్



వంద సంవత్సరాల క్రితం స్థాపించిన 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' నేడు భారతదేశ చరిత్రను పునర్లిఖించే క్రమంలో ఉన్నది. 1925 విజయదశమి రోజున నాగపూర్‌లో హెడ్గేవార్ స్థాపించిన ఈ సంస్థ దినదిన ప్రవర్ధమానమై దేశ ఐక్యతకు, ప్రపంచ శాంతికి పాటుపడుతోంది. 'నమస్తే సదా వత్సలే మాతృ భూమే' ఇది ఆ సంఘ్ ప్రాణగీతం. తల్లి భరతమాతను ఈ ప్రపంచానికే విశ్వగురువుగా నిలబెట్టాలన్నది ఆరెస్సెస్ ఏకైక లక్ష్యం. అందుకోసం ప్రతి భారతీయుడినీ, ముఖ్యంగా యువతను దేశ నిర్మాణంలో పాలు పంచుకునేలా చేయాలన్నదే తపనతో పనిచేస్తున్న ఏకైక సంస్థ అనడంలో ఎలాంటి అనుమానాలు లేవు. స్వాతంత్య్ర పోరాటంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాలుపంచుకోలేదనేది చరిత్ర తెలియని దేశ వ్యతిరేకుల ఆరోపణ. స్వాతంత్య్రం కోసమే దేశ భక్తులను సంఘ్ తయారు చేసింది. హెడ్గేవార్ 1921, 1931లో జైలు నిర్బంధానికి గురయ్యారు. వార్ధాలో హెడ్గేవార్‌ను కలుసుకున్న గాంధీజీ సంఘ్ క్రమశిక్షణను ప్రశంసించిన విషయం తెలుసుకుంటే మంచింది. దేశం పెను ప్రమాదాలు, విపత్తులు ఎదుర్కొన్నప్పుడు స్వయం సేవకులు తమ ప్రాణాలు కూడా లెక్క చేయకుండా ప్రజలకు సేవలందిస్తోంది. పాక్, చైనాలతో భారత్ యుద్ధం చేసిన సమయంలో భారత సైన్యానికి అండగా నిలబడ్డ సంస్థ కూడా ఆర్‌ఎస్‌ఎస్ అని రాహుల్ తెలుసుకుంటే మంచిది. దేశ విభజన, పంజాబ్, బెంగాల్ ప్రాంతాల్లోని హింస, దోపిడీ, అత్యాచారాలను నిలువరించడం, వలస వచ్చిన శరణార్థు లకు శిబిరాల ఏర్పాటు, కరువు సమయం లో నిత్యావసర వస్తువులను అందించడం వంటి చర్యల ద్వారా సంఘ్ చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 1977 నాటి దివిసీమ ఉప్పెనకు బలైన 20వేల మంది మృతదేహాల ను, పశువుల కళేబరాలనూ ఖననం చేసిన ఘనత సంఘ కరసేవకులదే. 1975 నాటి ఎమర్జెన్సీ సమయం లో జైలుకు వెళ్లిన వారిలో అనేకులు స్వయం సేవకులు ఉన్నారు. అవివేకంతో కూడిన అభ్యాసం కంటే జ్ఞానం మేలు. జ్ఞానం కంటే ధ్యానం ఉత్తమం. ధ్యానం కంటే కర్మఫల త్యాగం మంచిది. ఆ త్యాగం వల్ల మనశ్శాంతి కలుగుతుంది.' అని భగవద్గీత శ్లోకం భావం. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆశయాలతో కూడిన అనేక సంస్థలు ఉన్నాయి. అయితే వందేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ త్యాగాలకు సాటిరాగల మరో సంస్థ లేదనే చెప్పాలి. ఎందుకంటే ఆయా సంస్థలకు స్వలాభాపేక్ష ఉంది. కానీ ఆర్‌ఎస్‌ఎస్‌కు మాత్రం దేశ హితమే స్వార్థంగా ఉంది. వేల సంవత్సరాల భారతీయ సామాజిక విలువలే ఆలంబనగా, సామాజిక జీవనంలో ఏర్పడిన లోటుపాట్లను అధిగమిస్తూ, జీవన విధానంలో దృఢత్వం, సమాజం కోసం అంకితమైన వ్యక్తిత్వం తో ఓ విలక్షణమైన కార్యదీక్ష కలిగిన క్రమశిక్షణాయుత సమూహం ఆరెస్సెస్ సొంతం. అందుకే, కాలగమ నంలో అవరోధాలను, అణచివేతలను అధిగమిస్తూ... ప్రతికూల పరిస్థితుల్లో సైతం తన ప్రాబల్యాన్ని విస్తరిస్తూ, భారతీయ సంస్కృతిలోని సనాతన మూలాల నుంచి జాతీయవాద భావనతో ఆవిర్భవించి, మానవతా వాదాన్ని ఆవిష్కరిస్తోంది. దేశభక్తి అంటే జెండా ఎగరేయడం, దేశభక్తి గీతాలు పాడడం, ఐక్యత ప్రతిజ్ఞ చేయడం కాదని, ఈ స్ఫూర్తి మన ప్రవర్తనలో ప్రతిబింబించి, సమాజంలో పరివర్తనకు బీజాలు వేయాలన్నది ఆరెస్సెస్ లక్ష్యం. సమాజంలో అన్ని వర్గాల ప్రజలతో అరమరికలు లేకుండా కలిసి పనిచేసే అలవాట్లను ఆర్ఎసెస్ నేతలు ప్రేరేపించారు. ఈ స్ఫూర్తి కారణంగానే వందలాది సంఘ్ ప్రేరేపిత సంస్థలు భారతదేశ మంతటా పనిచేస్తున్నా ఎక్కడా అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు చెలరేగడం కనిపించదు. పైగా, వాటి పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపిస్తుంది. కులం, వర్గం, మతం, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు సమైక్యంగా ఉండాలని మాటలు చెప్పడం కాకుండా, ఆచరణలో ఆ విధంగా జీవించే వాతావరణం ఏర్పాటు చేయడంలో ఆరెస్సెస్‌ను మించిన మరో సంస్థ లేదని చెప్పవచ్చు. అందుకే రాజకీయాల పరిధిని మించి చూడలేని రాహుల్ లాంటి వారికి ఆరెస్సెస్ కార్యపద్ధతి అర్థం కాదు. దేశ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చూస్తేనే ఈ సంస్థ సిద్ధాంతం అవగతమవుతుంది. ఆవిర్భావం నుంచి రాజకీయ అధికారం కోసం కాకుండా 'వ్యక్తి నిర్మాణం' కేంద్రంగా, ప్రజలందరి శ్రేయస్సు కోసం ఆరెస్సెస్ పనిచేస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు సహాయం చేయడానికి, సహాయ కార్యక్రమాలను నిర్వహించడానికి, పేద పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు అందించడానికి, వృద్ధులకు సేవ చేయడానికి స్వయం సేవక్‌లు అందించే సేవలలో వివక్ష మచ్చుకైనా కనిపించదు. ఇంతటి ఉదాత్త ఆశయంతో పనిచేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ పట్ల ఏహ్య భావంతో రాహుల్ నోరు పారేసుకుంటున్నారు. బిజెపితో కలిసి అని నిందిస్తున్నారు. ఇలాంటి నిందలతో అధికారంలోకి రావాలనుకోవడం కాంగ్రెస్‌కు అసాధ్యం అని తెలుసుకోవాలి.

# కరూర్ ర్యాలీ విషాదానికి బాధ్యత ఎవరిది?

తమిళనాడులోని కరూర్ జిల్లాలో నటుడు-రాజకీయ నాయకుడు విజయ్ నిర్వహించిన ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట దేశాన్ని కలచివేసింది. రాజకీయ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 39 మంది మరణించారు, వీరిలో 17 మంది మహిళలు, 13 మంది పురుషులు మరియు 9 మంది పిల్లలు ఉన్నారు. ఈ విషాదకర ఘటనలో 80 నుంచి 95 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో 67 మందిని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్చగా, ఇద్దరు రోగుల పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉండటంతో వారికి వెంటిలేటర్ సపోర్ట్‌తో చికిత్స అందిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ వెంటనే స్పందించి, మృతుల కుటుంబాలకు □10 లక్షల పరిహారం ప్రకటించడంతో పాటు, ఘటనపై విచారణకు ఏకసభ్య కమిషన్‌ను నియమించారు. ఈ ఘోర విషాదానికి వేదిక ఇరుకుగా ఉండటం, నిర్వాహక లోపాలు, మరియు జన నియంత్రణ వైఫల్యమే ప్రధాన కారణాలుగా తేలాయి. అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకర విషయం. ఈ ఘటన పట్ల దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకులు, ప్రజాకర్షణ కలిగిన వ్యక్తుల సభలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతారని తెలిసిందే. అయినప్పటికీ, భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించడం వల్ల ఇలాంటి ప్రాణ నష్టం జరగడం ఎంతటి నిర్లక్ష్యం, ఎంతటి బాధ్యతారాహిత్యమో ఆలోచనీయాంశం.

ఈ ఘటన వెనుక ఉన్న మూలకారణాలు స్పష్టమే. ఒకవైపు రాజకీయ ఆవేశం, మరోవైపు అశాస్త్రీయ నిర్వహణ. గుంపు అంచనాకు తగిన ప్రదేశం ఎంచుకోకపోవడం, సన్నని మార్గాలను ప్రవేశ-నిష్క్రమణ దారులుగా ఉపయోగించడం, సరైన బారికేడ్ల లేమి ఇవే ప్రజలు ఒక్కసారిగా ముందుకు తోసుకురావడానికి దారితీసాయి. నాయకుడిని దగ్గరగా చూసే ఆత్రుత, ఉత్సాహం కూడా ఆ ప్రమాదాన్ని మరింత పెంచింది.

ఇదంతా చూస్తే నిర్వాహకుల తప్పిదం మాత్రమే కాక, పాలనా వ్యవస్థ వైఫల్యం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. అంత పెద్ద రాజకీయ కార్యక్రమానికి తగినంత పోలీసు సిబ్బంది, మహిళా సిబ్బంది, అత్యవసర వైద్య బృందాలు నియమించకపోవడం ఘోర నిర్లక్ష్యం. సమూహం నియంత్రణ ప్రణాళిక, అత్యవసర నిష్క్రమణ మార్గాలు లాంటి మౌలిక అంశాలు ముందే సరిచూడాల్సిన అధికారులు తమ కర్తవ్యంలో విఫలమయ్యారు. తొక్కిసలాట మొదలైన తర్వాత కూడా తక్షణ చర్యలు



తీసుకోలేకపోవడం వల్ల పరిస్థితి మరింత విషమమైంది.

ఇలాంటి దుర్ఘటనలు మన దేశంలో కొత్తవేమీ కావు. మతపరమైన ఉత్సవాల నుంచి ఉచిత పంపిణీ, రాజకీయ సభల వరకు తొక్కిసలాటలు పదే పదే జరుగుతున్నాయి. గుంటూరులో సంక్రాంతి కానుకల పంపిణీ సందర్భంగా జరిగిన దుర్ఘటన లేదా మరెన్నో ర్యాలీల్లో ప్రాణ నష్టాలు మనకు పాఠాలుగా ఉండాల్సింది. కానీ దురదృష్టవశాత్తూ, ప్రతిసారి ఆ పాఠాలను మరచిపోతున్నాం. ప్రజల ప్రాణాల కంటే నాయకుల ప్రజాదరణ ప్రదర్శనకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం వలనే ఈ విషాదాలు పునరావృతమవుతున్నాయి. కరూర్ ఘటనలో మొదటి బాధ్యత నిర్వాహకులదే. తమ నాయకుడి బలం ప్రదర్శనలో ప్రజల ప్రాణాలను పణంగా పెట్టారు. రెండో బాధ్యత ప్రజల భద్రతకు భరోసా ఇవ్వాల్సిన అధికారులదే. చట్టాల అమలును భారంగా భావించి, రాజకీయ ప్రయోజనాల కోసం నిర్లక్ష్యం చూపడం ఈ విపత్తుకు దారితీసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం(డ్రోన్లు, సిసిటివి వంటి పర్యవేక్షణ)సమర్థవంతంగా ఉపయోగించి ఉంటే, సమూహం నియంత్రణ మరింత సులభమయ్యేది. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకూడదంటే, రాజకీయ పార్టీలు, నాయకులు, అధికారులు అందరూ కలిసి సమగ్రంగా బాధ్యత వహించాలి. పెద్ద సభలు బహిరంగ ప్రదేశాల్లో, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో మాత్రమే జరగాలి. క్యూ వ్యవస్థను తప్పనిసరి చేయాలి. ప్రజల ప్రాణాలకు మించినది ఏదీ లేదనే భావనను పాలకులు, నిర్వాహకులు గుండెల్లో పెట్టుకోవాలి. గత కొద్ది సంవత్సరాలలో భారతదేశంలో కరూర్ లాంటి తొక్కిసలాటలు పునరావృతమవుతూనే ఉన్నాయి. ఈ విషాదాల్లో అతి పెద్దది మరియు చారిత్రక ప్రాధాన్యత కలిగిన సంఘటన: 1954లో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళా తొక్కిసలాటలో సుమారు 316 నుంచి 800 మంది మరణించారు. ఇటీవల, 2025 ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో బారికేడ్‌లు విరిగిపడటం వల్ల మరో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 2013లో ఇదే ప్రాంతంలో రైల్వే స్టేషన్ వద్ద జరిగిన తొక్కిసలాటలో 36 మంది మరణించారు. మతపరమైన కార్యక్రమాలతో పాటు, క్రీడా విజయోత్సవాలూ విషాదానికి వేదికలయ్యాయి: 2025 జూన్ 4న, ఈఫ్ఎ విజయం సాధించిన సందర్భంగా బెంగళూరులోని ం. చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన ఆర్ సి బి (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు) ర్యాలీ తొక్కిసలాటలో 11 మంది మరణించగా, నిర్వాహక లోపమే ప్రధాన కారణంగా తేలింది. ఇక రాజకీయ, పంపిణీ కార్యక్రమాల విషయానికొస్తే, 2022 డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉచిత వస్త్రాల పంపిణీ సందర్భంగా ముగ్గురు మహిళలు మరణించారు. అదే నెలలో కందుకూరు రోడ్‌షోలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, 2022 జనవరిలో వైష్ణో దేవి ఆలయం వద్ద భక్తుల రద్దీ వల్ల జరిగిన తొక్కిసలాటలో 12 మంది మరణించారు. ఈ సంఘటనలన్నీ ముందస్తు ప్రణాళిక లేమి, గుంపు నిర్వహణలో వైఫల్యం, భద్రతా లోపాలు మరియు నిర్వాహక నిర్లక్ష్యం కారణంగానే సంభవిస్తున్నాయని స్పష్టం చేస్తున్నాయి. కరూర్ తొక్కిసలాట మన సమాజానికి ఒక ఘోర హెచ్చరిక. ఇది కేవలం ఒక విషాదం కాదు, బాధ్యతా రాహిత్యానికి అద్దం పట్టిన సంఘటన. ఇప్పుడు కనీసం కరూర్ ఘటన నుండి పాఠాలు నేర్చుకోకపోతే, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని విషాదాలు మనల్ని వెంటాడుతాయి.



# భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి

### కొలింబియా పర్యటనలో రాహుల్ వ్యాఖ్యలు

నరేంద్ర మోడీ పాలనలోని భారత్‌లో ప్రజాస్వామ్య దాడులు జరుగుతున్నా యంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశానికి అత్యంత ప్రమాదకరమైనది ఏదైనా ఉందంటే అది దేశంలో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడేనంటూ మండిపడ్డారు. కొలంబియా పర్యటనలో ఉన్న ఆయన ఈఐఏ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత్‌లో ఎన్నో మతాలు, కులాలు, సంప్రదాయాలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రతిఒక్కరికీ చోటుకల్పిస్తుంది. కానీ ప్రస్తుతం ఈ వ్యవస్థ ముప్పేటదాడిని ఎదుర్కొంటోందన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇంధన వినియోగంలో వచ్చిన మార్పులతో అనేక సామ్రాజ్యాల సృష్టి జరుగుతూవస్తోంది. బ్రిటిష్‌వారు ఆవిరి యంత్రం, బొగ్గుపై నియంత్రణ సాధించారు. తర్వాత వారు సూపర్‌పవర్‌గా మారారు. ఆ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి 1947లో మేం స్వాతంత్య్రం సాధించుకున్నాం. పెట్రోల్ వినియోగం పెరిగింది. ఆ క్రమంలో అమెరికన్ల పట్టుపెరిగింది. ప్రపంచం ఇప్పుడు ఎలక్ట్రిక్ మోటార్ వైపు మళ్లుతోంది. ఇప్పుడు పోటీ అమెరికా, చైనా మధ్య నెలకొని ఉంది. ఈ విషయంలో చైనానే ముందుంది. చైనాకు భారత్ పొరుగుదేశం. అమెరికాకు మిత్రదేశం. ఈ రెండు దేశాలు పోటీపడుతుంటే మధ్యలో మేం ఉన్నాం. చైనాకంటే భారత్ జనాభా ఎక్కువ. ఆ దేశంలో కేంద్రీకృత వ్యవస్థ ఉంది. ఇండియాలో వికేంద్రీకృత, వైవిధ్య వ్యవస్థ ఉంది. అది సంక్లిష్టంగా ఉంటుంది. చైనాతో పోల్చుకుంటే భారత్‌కున్న సామర్థ్యాలు భిన్నమైనవి. మా దేశం అధ్యాత్మిక, సైద్ధాంతిక సంప్రదాయాలను కలిగిఉంది. అవి ఈనాటికీ ఆచరణీయమైనవి. చైనాలాగా భారత్ తన ప్రజలను అణచి వేయదని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఆర్థిక వృద్ధి ఉంది. అయితే మాది సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థ. కానీ ఉత్పత్తి భారీ స్థాయిలో లేకపోవడంతో ఉద్యోగాల కల్పన ఆశించినస్థాయిలో లేదు. చైనా అప్రజాస్వామిక వాతావరణంలో ఉత్పత్తి చేస్తోంది. కానీ మాకు ప్రజాస్వామ్య వ్యవస్థే ఉండాలి. అలాంటి వ్యవస్థను అభివృద్ధి చేయడమే సవాలని పేర్కొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733